


శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించడానికి వెళ్తున్న మాజీ మంత్రి

శ్మశానవాటికలో సౌకర్యాలు

- బోరు, కంచె ఏర్పాటుకు చర్యలు
- పరిశీలించిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

కొత్తచెరువు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని, బోరు బావిని తవ్వించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కొత్తచెరువులో జనవరి 28న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంలో ఈ సమస్యను ప్రజలు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, శ్మశాన వాటికకోసం పుట్టపర్తి రహదారి పక్కన 1451 సర్వే నంబరులో 3.45 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇదే స్థలంలో కొందరు గతంలో ఇంటి స్థలాల పట్టా పొందారు. వారిని మాజీ మంత్రి పల్లె శుక్రవారం పిలిపించి మాట్లాడారు. వారికి భూమి, ఇంటి స్థలాల పట్టాలను మరోచోట ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు పల్లెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, మండల, పట్టణ కన్వీనర్‌లు అడపాల రామకృష్ణ, ఒలిపి శీన, నాయకులు బండ్లపల్లిరాజు, డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, వీఆర్‌ఓ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ఇక బడిబాట..!

- ముగిసిన కొత్త టీచర్ల నియామక ప్రక్రియ
- నేడు ఉత్తర్వులు.. సోమవారం నుంచి విధులకు..

(వివరాలు 6వ పేజీలో...)

జాతీయ రహదారి వెంబడి లేపాక్షి హబ్‌కు కేటాయించిన వేలాది ఎకరాల భూములు





గుడిపల్లి పారిశ్రామిక పార్కు

పారిశ్రామిక పండగొచ్చింది..!

- ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం
- భూముల కేటాయింపు
- కరువు నేలకు పెట్టుబడుల వరద
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమకూ గ్రీన్ సిగ్నల్

శ్రీసత్యసాయి జిల్లాకు రేమండ్.. అనంతకు సోలార్ ప్లాంట్లు

పుట్టపర్తి/హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాకు దసరా, దీపావళితోపాటు పారిశ్రామిక పండగొచ్చింది. పెట్టుబడుల వరద వస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలో రేమండ్ రెండు అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. అనంతపురం జిల్లాలో రెండు చోట్ల సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. అంతేకాదు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ కూడా అందుబాటులోకి రానుంది. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

టేకులోడు, గుడిపల్లిలో ఏరోస్పేస్, ఆటోమోటివ్ కాంపోనెంట్ పరిశ్రమలు

రేమండ్ గ్రూప్ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చింది. అందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రేమండ్ గ్రూప్ అనుబంధ సంస్థ జేకే మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం సోమందేపల్లి మండలం గుడిపల్లి పారిశ్రామిక పార్కులో 30 ఎకరాలను కేటాయించారు. ఎకరా రూ.45.95 లక్షలతో అప్పగించారు. రూ.430 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమ ద్వారా 4,096 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. రేమండ్ గ్రూప్‌నకే చెందిన మరో అనుబంధ సంస్థ జేకే మైని గ్లోబుల్ ఏరోస్పేస్ లిమిటెడ్ చిలమత్తూరు మండలం టేకులోడుతోపాటు గుడిపల్లి పారిశ్రామి పార్కులో ఏరోస్పేస్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. రూ.510 కోట్లు పెట్టుబడితోట 1,400 మందికి (మిగతా 6లో..)

బాణసంచా విక్రయానికి

376 దరఖాస్తులు

- హిందూపురంలో పోటాపోటీ

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా జిల్లాలో బాణసంచా విక్రయ లైసెన్సు కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లావ్యాప్తంగా 376 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవ నాయుడు తెలిపారు. దరఖాస్తు గడువు ముగియడంతో వాటిని పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. హిందూపురంలో లైసెన్సుల కోసం పోటీ పడ్డారు. ఏకంగా 91 మంది దరఖాస్తు చేసుకున్నారంటే పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రామగిరి మండలంలో ఒక్కరు మాత్రమే ముందుకొచ్చారు. కనగానపల్లి, అగళి మండలాల నుంచి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

నిబంధనల మేరకే అనుమతులు



జిల్లాలో బాణసంచా విక్రయ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేసుకుంటే అనుమతులు ఇస్తాం. ఆయా ఫైర్‌స్టేషన్ల అధికారులు.. దరఖాస్తుదారులు ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికను ఆయా ఆర్డీఓలకు సమర్పిస్తారు. అటు నుంచి తుది అనుమతికోసం కలెక్టర్‌కు నివేదిస్తాం.

- మాధవనాయుడు,
జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

బోధనేతర పనుల బహిష్కరణ

- సోమందేపల్లిలో హెచ్‌ఎంకు ఉపాధ్యాయుల వినతి

కొత్తచెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం తెలియజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. జూన్ నెల నుంచి యోగాంధ్ర, మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, జీఎస్టీ-2 పేరుతో మొక్కల పెంపకం, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ చేయడం, విద్యా కానుకలను విద్యార్థులకు అందజేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అలాగే వాటి వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ప్రతి రోజు నివేదికను ఎంఈఓ కార్యాల యానికి పంపినట్లు తెలిపారు. దీంతో బోధనా సమయం తగ్గి విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం తమను బోధనేతర పనులకు తప్పించి, గ్రామ సచివాలయాలలోని సిబ్బందికి అనుసంధానం చేయాలని వారు వినతిపత్రంలో కోరారు.



సోమందేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

పకడ్బందీగా సదరం క్యాంపు: కలెక్టర్

హిందూపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ రీఅసెస్మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న విభిన్న ప్రతిభావంతులకు ఏర్పాటు చేసిన సదరం క్యాంపును పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న క్యాంపును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెన్షనరీ అసెస్మెంట్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ నోటీసులు జారీ చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. తర్వాత ఆస్పత్రిలో రోగులకు అందే వైద్యంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అన్నపూర్ణ, టీసీహెచ్‌ఎస్ మధుసూదన్, ఆర్‌ఎంఓ లక్ష్మీరామ్‌నాయక్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

పట్టు సాగులో ప్రథమ స్థానంలో నిలపాలి

పట్టుసాగులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్థానిక పట్టు గూళ్ల మార్కెట్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మార్కెట్‌కు వచ్చిన పట్టు రైతులతో మాట్లాడారు. రైతులు మల్బరీని అత్యధికంగా సాగుచేసి జిల్లాకు పట్టుసాగు జిల్లాగా పేరు తేవాలన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి): మహిళలు, బాలికల కోసం రూపొందించిన శక్తియాప్‌పై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మహిళ పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో శక్తిటీం శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఆపదలో ఉన్నప్పుడు శక్తియాప్ ద్వారా తక్షణసాయం పొందవచ్చని సభ్యులు వివరించారు. 112 అత్యవసర సాయం, చైల్డ్‌లైన్ సహాయంకోసం 1098, పిల్లల సమస్యలు, గృహహింస కోసం 181, వేధింపుల నివారణ కోసం 1091, సైబర్ టోల్‌ఫ్రీ 1930 నంబర్లను ప్రతిఒక్కరూ తమ సెల్‌ఫోన్‌లలో ఫీడ్ చేసుకోవాలన్నారు. ప్లేస్టోర్ నుంచి శక్తియాప్‌ను వ్యక్తిగత వివరాలతో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తక్షణసాయం కోసం యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ లేదా డయల్ 112 నంబరు ద్వారా ఫిర్యాదు చేస్తే పదినిముషాల్లో పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను రక్షిస్తారన్నారు.



అవగాహన కల్పిస్తున్న శక్తి టీం సభ్యులు

భారీ వర్షం

- మరువ పారిన చెరువు
- చిత్రావతి నది పరవళ్లు
- పొలాల్లో నీరుచేరి పంటనష్టం



పారుతున్న ధర్మవరం చెరువు మొదటి మరువ

పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది



ధర్మవరం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం కురిసింది. భారీ వర్షానికి ధర్మవరం చెరువు మొదటి మరువ పారింది. మరువ వద్ద మున్సిపాలిటీ చెత్త, మట్టి కుప్పలు ఉండటంతో నీరు ముందుకు వెళ్లలేక రోడ్డుపై నిలిచింది. రాకపోకలకు తీవ్ర అంతరాయ ఏర్పాడింది. దీంతో చిన్నారు రోడ్డుమీదుగా రాకపోకలు సాగించారు. మరువ నీటిని చూసేందుకు ప్రజలు ఆసక్తిగా తరలివచ్చారు. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. పోతులనాగేపల్లి, తిప్పేపల్లి వద్ద చిత్రావతి నది ఉధృతంగా పారుతోంది. కనంపల్లి, తిప్పేపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధర్మవరం మండలం తుమ్మల గ్రామంలో రైతు చంద్రశేఖర్‌రెడ్డి రెండు ఎకరాల్లో సాగుచేసిన టమోటా పంట నీట మునిగింది. మరో వారం రోజుల్లో పంట కోతకు రానుంది. ఈ సమయంలో వర్షం కారణంగా రూ.2లక్షల వరకు పెట్టుబడి నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు పర్యటించాలి..

భారీ వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు అధికారుల కోసం ఎదురు చూస్తున్నారు. వేరుశనగ, అరటి, కూరగాయాల పంటలకు నష్టం జరిగిందని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు కన్నెత్తి చూడటంలేదని విమర్శిస్తున్నారు.

రొద్దంలో వర్షం

రొద్దం మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వేలాది ఎకరాల్లో సాగైన కందిపంటకు మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా వర్షం లేక కంది పంట ఎండిపోతోంది. ఇలాంటి సమయంలో భారీ వర్షం కురవడంతో రైతులలో ఆశలు చిగురించాయి. కాగా, పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో సీసీ రోడ్డుపై భారీగా నీరు నిలిచింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి సమస్యను పరిష్కరించారు. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డుపై నీరు నిలిచి.. పెనుకొండ, పావగడకు వెళ్లే వాహనాలకు అంతరాయం కలుగుతోంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు స్పందించి, రోడ్డు ఎత్తును పెంచాలని, మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రొద్దంలో రోడ్డుపై నిలిచిన వర్షంనీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో మళ్లిస్తున్న టీడీపీ నాయకులు

భారీగా వర్షపునీరు రావడంతో కేతేపల్లి వద్ద తెగిన హంద్రీనీవా కాలువ



తెగిన హంద్రీనీవా కాలువ

మడకశిర రూరల్: కృష్ణా జలాలకు తోడు భారీగా వర్షపు నీరు చేరడంతో కేతేపల్లి వద్ద హంద్రీనీవా కాలువ తెగిపోయింది. ఆ నీరు పరిగి చెరువుకు చేరుతోంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర మండలంలోని మణూరు చెరువుకు కృష్ణా జలాలు వస్తున్నాయి. కాలువ నిండుగా పారుతోంది. శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగుల నుంచి ఆ నీరు హంద్రీనీవా కాలువలోకి రావడంతో ఉధృతి తట్టుకోలేక గట్టు తెగిపోయింది. అధికారులు, ఇంజనీర్లు అక్కడికి చేరకుని మరమ్మతులు చేపట్టారు. నీరు వేగంగా వస్తుండంతో పనులను పూర్తిగా చేయలేకపోయారు. పంపుహౌస్ వద్ద నీటీని నిలుపుదల చేశారు. శనివారం మరమ్మతులు చేసి నీటిని వదులుతామని అధికారలు తెలిపారు.



ఓబులేష్ మృతదేహం

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

కల్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చెరువులో చేపల వేటకు వెళ్లి శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ జాలరి ప్రమాదవశాత్తు మునిగిపోవడంతో మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీలో గురువారం జరిగింది. కల్లూరు పోలీసుల కథనం మేరకు.. సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం సుబ్బరాయనిపల్లికి చెందిన ఓబులేష్ (48) కొన్నేళ్లుగా అన్నమయ్య పీలేరు పరిసర ప్రాంతాల్లో చేపల వేటకు వచ్చి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేదీన ఓబులేష్ తన స్వగ్రామం నుంచి పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీకి చెందిన శ్రీనివాసులు వద్దకు వచ్చాడు. అతడి ఇంటి వద్దే ఉంటూ సమీపంలోని కృష్ణమ్మచెరువులో చేపలు పడుతుండేవాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఓబులేష్ వల తీసుకొని చేపలు పట్టేందుకు కృష్ణమ్మచెరువు వద్దకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం అవుతున్నా ఓబులేష్ తిరిగి ఇంటికి రాకపోవడంతో శ్రీనివాసులు చెరువు వద్దకెళ్లి చూడగా కట్టపై చెప్పులు, దుస్తులు ఉండటం గుర్తించాడు. దీంతో ఆందోళన చెందిన శ్రీనివాసులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చి ఓబులేష్ కోసం చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సుమారు 7 గంటల సమయంలో చెరువులో నుంచి ఓబులేష్ మృతదేహాన్ని వెలికితీసి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వీఆర్వోలు ఏరీ ?

ఐదు రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కు

● పనులు సాగక ప్రజలు, రైతులకు ఇబ్బందులు



రాప్తాడు తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల కొరతతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదు మేజర్ రెవెన్యూ గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్వోలే దిక్కవడంతో తమ సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేజర్ రెవెన్యూ గ్రామాలైన గాండ్లపర్తి, బండమీదపల్లి, యర్రగుంట, రాప్తాడు, గంగలకుంటకు గత ఆరు నెలలుగా రెగ్యులర్ వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్ వీఆర్వోలే వీటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ రెవెన్యూ గ్రామాల్లో అనేక భూ సమస్యలు ఉన్నాయి. వీఆర్వోల కొరత వలన కొన్ని రకాల పనులు ముందుకు కదలడం లేదు.

ఆలస్యమవుతున్న పనులు

రెగ్యులర్, ఇన్‌చార్జ్ రెవెన్యూ గ్రామాల విధులతో పని ఒత్తిడి పెరిగిందని, ఎక్కడా పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నట్లు వీఆర్వోలు వాపోతున్నారు. రెవెన్యూ శాఖలో వీఆర్వోల పాత్ర కీలకం. వారి సంతకం లేనిదే ఏ ఫైలు కదలదు. వీఆర్వోలు కొరత వలన కులం, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, భూ సమస్యలు, ఓటర్ వెరిఫికేషన్, ఈ క్రాప్, ఆదార్ వెరిఫికేషన్, రేషన్ కార్డులు, రికార్డులు రాయడం, సర్వే, భూ సమస్యలు, ఇతర అనేక పనులు సకాలంలో పూర్తికావడం లేదు. చిన్న చిన్న సమస్యలకు కూడా ప్రజలు, రైతులు పదే పదే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలతో వందలాది మంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. పంట రుణాల రెన్యువల్ సమయంలో వన్‌బీ పత్రాలపై వీఆర్వో సంతకం తప్పనిసరిగా ఉండాలి. రైతులు గోకులం షెడ్లు, మామిడి మొక్కల పెంపకం, ఇతర అనేక పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నా వీఆర్వో సంతకం తప్పనిసరి. ఇంతటి కీలకమైన బాధ్యతలు ఉన్న వీఆర్వోలు ఇన్‌చార్జ్‌లుగా ఉండటంతో ఆయా గ్రామాల్లో పనులు సకాలంలో జరగక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలని కోరుతున్నారు.

చుక్కల తొలగింపు కోసం తిరుగుతున్నా..

మాకు బండమీదపల్లి పొలం సర్వే నెంబర్ 391లో ఉన్న దాదాపు 16 ఎకరాల భూమి చుక్కల భూమిగా నమోదైంది. చుక్కల తొలగింపు కోసం మూడు నెలల కిందట తహసీల్దార్ కార్యాలయానికి రికార్డు సమర్పించా. రెగ్యులర్ వీఆర్వో లేకపోవడం, ఇన్‌చార్జ్ వీఆర్వోలు మారుతుండటంతో ఫైలు ముందుకు కదలడం లేదు. ఆ పని కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పదే పదే తిరుగుతున్నా. రెగ్యులర్ వీఆర్వోను నియమించాలి.

-రామాంజనేయులు, రైతు, బండమీదపల్లి

ఉన్నతాధికారులకు తెలియజేశాం



వీఆర్వోల కొరత వాస్తవమే. ఐదు రెవెన్యూలకు వీఆర్వోలు లేరు. ఇన్‌చార్జ్‌లే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక వీఆర్వో సెలవులో ఉన్నారు. ఇంకొక వీఆర్వో డెప్యుటేషన్‌పై ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. ఉన్న కొంత మంది వీఆర్వోలతోనే ప్రజల పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

-విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

పారిశ్రామిక పండగొచ్చింది..!



టేకులోడు వద్ద ఏపీఐఐసీ సేకరించిన భూములు

(5వ పేజీ తరువాయి)

ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఇందుకోసం 47.28 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ రెండు యూనిట్ల ద్వారా రూ.940 కోట్ల పెట్టుబడులు రాగా.. 5,496 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ పరిశ్రమల నిర్మాణం 2026 మార్చిలో ప్రారంభమై 2027 మే నెలలో ఉత్పత్తి మొదలు పెట్టనున్నాయి.

పరిశ్రమలు రావడం సంతోషంగా ఉంది



ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు రేమండ్ కంపెనీ ముందుకు రావడం చాలా సంతోషం. గతంలో పరిశ్రమల ఏర్పాటుకోసం భూసేకరణ చేసి ఏళ్లు గడిచినా ఒక్క పరిశ్రమ రాలేదు. టేకులోడు ప్రాంతాన్ని పారిశ్రామిక వాడగా ఏర్పాటు చేస్తే చిలమత్తూరు మండలంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలన్నీ అభివృద్ధి చెందుతాయి.

-బయపరెడ్డి, ఆరుమాకులపల్లి, చిలమత్తూరు మండలం

వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు



టేకులోడు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే చదువుకున్న పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే రోడ్ల పరంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చిందింది. ఇలాంటి చోట పరిశ్రమలు ఏర్పాటైతే ఈ ప్రాంత ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

-ఆదినారాయణరెడ్డి, టేకులోడు, చిలమత్తూరు మండలం

భూములు కోల్పోయినా.. ఉపాధి దొరుకుతుంది



పరిశ్రమల కోసం వ్యవసాయ భూములను ప్రభుత్వానికి ఇచ్చాం. వెంటనే ఇక్కడ రేమండ్ కంపెనీ పరిశ్రమ ఏర్పాటు చ ఏస్తోందని తెలుస్తోంది. దీంతో భూములు కోల్పోయామన్న బాధ లేదు. వెంటనే మాకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

-విజయకుమార్, టేకులోడు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

రెమండ్ గ్రూప్ అనుబంధ సంస్థల ఏర్పాటుకు వీలుగా ఆయా పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. పరిశ్రమల ఏర్పాటుకు భూములను తక్షణమే సిద్ధం చేస్తాం.

-నాగకుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

ఉరవకొండకు సౌర వెలుగులు

అనంతపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాకు సౌర వెలుగులు రానున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలో రెండు సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయి. రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బెళుగుప్ప మండలం ఎర్రగుడి, ఆవులెన్న, శీర్పి, దుద్దేకుంట, అంకంపల్లి, తగ్గుపర్తి గ్రామాల పరిధిలో 400 మెగావాట్ల ఏ/సి, 500 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుంచి 25 సంవత్సరాలకు రూ.120 కోట్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. మొదటి 12 సంవత్సరాలకు రూ.1.50 లక్షలు/మెగావాట్ల చొప్పున, మిగిలిన 13 సంవత్సరాలకు గానూ ఏడాదికి రూ.50 వేల చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి చార్జీలు వసూలు చేస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 1,380 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 మేరకు వజ్రకరూరు మండలం కమలపాడు, కొనకొండ్ల, గూళ్లపాళ్యం గ్రామాల్లో 600 మెగావాట్లతోపాటు 400 మెగావాట్ల ఏ/సి 580 మెగావాట్ల డీసీ సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపు కోసం ఊర్జా వన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థన మేరకు ఆయా ప్రాంతాల్లో సోలార్ పరిశ్రమలు నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

అమలుకానున్న మంత్రి లోకేశ్ హామీ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునే విధంగా మంత్రిమండలిలో నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు అనంత జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ నెలకొల్పేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎక్కడ ఏర్పాటు చేస్తారు, భూముల ఏర్పాటు తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

జేజేఎంతో తాగునీటి సమస్యకు చెక్

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్


సిబ్బందితో సమీక్షిస్తున్న ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ (జేజేఎం) ద్వారా రూ.3,800 కోట్లతో జిల్లాలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ఈఈ శ్రీనివాసులుతో కలిసి రాయదుర్గం డీఈ రామారావు, ఉరవకొండ డీఈ అంజుమాన్ సఫ్రీన్‌లతో నీటి పథకాలపై సమీక్షించారు. అనంతరం ఎస్‌ఈ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వనరుల ద్వారా ప్రతి గ్రామానికి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. పీఏబీఆర్ నుంచి ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు, శింగనమల నియోజకవర్గంలోని కొన్ని మండలాలకు, గండికోట ప్రాజెక్టు నుంచి తాడిపత్రి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గంలోని మండలాలకు, మిడ్‌పెన్నార్ డ్యాం నుంచి గుత్తి నియోజకవర్గంతో పాటు శింగనమల నియోజకవర్గానికి నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

లైవ్ బకాయిలు !

బీఎస్ఎన్ఎల్‌కు రూ.40 లక్షల బిల్లుల పెండింగ్

● పేరుకు పోయిన ప్రభుత్వ కార్యక్రమాల లైవ్ టెలీకాస్టింగ్ బకాయిలు

● బిల్లుల కోసం కలెక్టర్ల చుట్టూ బీఎస్ఎన్ఎల్ అధికారులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సంస్థను మొండి బకాయిలు వేధిస్తున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.40 లక్షల వరకూ బకాయిలు ఉన్నట్లు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఏ కలెక్టర్‌ను అడిగినా ప్రభుత్వం నుంచి ఫండింగ్ రావాలి అంత వరకూ తామేమీ చేయలేమని చెబుతుండటంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పెండింగ్ బిల్లులిలా...

వైసీపీ పాలనలో 2023లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి వచ్చారు. ఆయన పర్యటన లైవ్ కవరేజీ కోసం బీఎస్ఎన్ఎల్‌ను సంప్రదించారు. సీఎం ప్రోగ్రామ్ కావడంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు సైతం లైవ్ టెలికాస్టింగ్‌కు అనుమతులిచ్చారు. ఇందుకు రూ.2.20 లక్షలు ఖర్చు అయ్యింది. మరోమారు వైసీపీ హయాంలోనే అనంత జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమం లైవ్ కవరేజీ ఖర్చు రూ.12 లక్షల వరకూ వచ్చినట్లు సమాచారం. అనంతరం అధికారులు సంబంధిత జిల్లా కలెక్టర్ వద్దకు బిల్లుల కోసం వెళ్తే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తామని చెప్పారు. తర్వాత కొద్ది రోజులకు రాష్ట్రంలో అధికారం మారింది. అయినా బిల్లులు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొలువుదీరాకా శ్రీసత్యసాయి జిల్లాలోని కొత్తచెరువులో సీఎం చంద్రబాబునాయుడు పర్యటించారు. ఆ కార్యక్రమం కవరేజీ ఖర్చు రూ.3 లక్షలు అయ్యింది. అనంతరం అనంతపురంలో జరిగిన మరో కార్యక్రమానికి సంబంధించి రూ.12 లక్షలు, మరోమారు అనంత జిల్లాలోని ఓ నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటించిన కార్యక్రమానికి సంబంధించి రూ.3 లక్షలు, అనంత అర్బన్‌లో తాజాగా నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి సంబంధించి రూ.8 లక్షలు బిల్లులు బీఎస్ఎన్ఎల్ సంస్థకు అందాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కలెక్టరేట్‌లోని కొందరు అధికారులు లైవ్‌టెలీకాస్టింగ్‌కు సంబంధించిన బిల్లులు కలెక్టర్లకు సకాలంలో అందించకపోవడంతోనే చెల్లింపులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

పెండింగ్ వాస్తవమే



రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు సంబంధించిన లైవ్ టెలికాస్టింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే పలుమార్లు రెండు జిల్లాల కలెక్టరేట్ వర్గాలకు బిల్లులు చెల్లించాలని చెప్పాం. అయినా ఇప్పటి వరకూ క్లియర్ కాలేదు. ఆ బిల్లులు క్లియర్ అయితే బీఎస్ఎన్ఎల్‌ను ఆర్థికపరమైన అంశాలతో అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

-ముజీబ్ పాషా, పీజీఎం, బీఎస్ఎన్ఎల్

రెజ్లింగ్ జట్ల ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ ఉమ్మడి జిల్లా జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్-14, 17, 19 రెజ్లింగ్ ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

అండర్-14 బాలురలో... సాయి, జస్వంత్, వెంకట మనోజ్, కుషాల్, సంజీవ్, యశ్వంత్, ప్రభాస్, ధనుంజయ, రుషివర్ధన్, విశాల్ ఎంపిక య్యారు.

బాలికల విభాగంలో... రోజా, మన్విత, లావణ్య, యశశ్విని, చందన, స్వరూప, చాందిని, శ్లోక, నందిత, కావ్యశ్రీ ఎంపికయ్యారు.

అండర్-17 బాలుర విభాగంలో.. రామచరణ్ తేజ, రామ్‌చరణ్, నందీష్, గణేష్,శాంతులు ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో... అనూషా, యాసిన్, విష్ణుప్రియ, లాస్యరెడ్డి, యశస్వని, స్వరూప, శాలిని, మందారలు ఎంపికయ్యారు.

అండర్-19 బాలుర విభాగంలో... శివసాయి, తరుణ్‌కుమార్ రెడ్డి, శరత్, రాజేష్‌ను ఎంపిక చేశారు.

బాలికల విభాగంలో... మోక్షిత, శృతి, గౌతమి, కె శైలజ, స్పందన, బి శైలజ, హర్షిత ఎంపికయ్యారు. వీరు ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శ్రీనివాసులు తెలిపారు.

ప్రకృతి సేద్యాన్ని పరిశీలించిన పరదేశీ

పంటల సాగును తెలుసుకున్న ఇంగ్లాండ్ దేశీయుడు


ప్రకృతి వ్యవసాయంపై మహిళా రైతులతో ఆరాతీస్తున్న క్రిస్టోఫర్

గార్లదిన్నె, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ఇంగ్లాండ్ దేశానికి చెందిన ట్రావెలర్, జర్నలిస్టు, ప్రకృతి ప్రేమికుడు క్రిస్టోఫర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ప్రోగ్రామ్ మేనేజర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన చీనీ, వేరుశనగ, ఆముదం తదితర పంటలను ఆయన పరిశీలించారు. చీనీ పంట సాగులో రైతులు మానస, కిశోర్ వినియోగిస్తున్న సేంద్రియ కర్షనం, వానపాములు, నేల సంతానోత్పత్తి గురించి తెలుసుకున్నారు. వేరుశనగ పంటను పరిశీలించి జీవ వైవిధ్య పంటల వలన కలుగు లాభాలపై ఆరా తీశారు. ఆముదం పంట సాగు గురించి రైతు హేమలతను అడిగి తెలుసుకున్నారు. దుంపజాతి కూరగాయలు, ఆకుకూరలు, పూల ద్వారా రైతు వరలక్ష్మి ఆర్జించిన లాభాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం, జీవనోపాధులు ఏవిధంగా అభివృద్ధి చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన, ద్రవ జీవామృతాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మి, ప్రకృతి వ్యవసాయం ఎస్ఎఫ్ఐ నందిని, ఎర్రిస్వామి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం గంట.. మధ్యాహ్నం మరో గంట!

● ఇష్టారాజ్యంగా ఉద్యోగుల హాజరు

● ఎన్‌హెచ్ విభాగంలో కనిపించని సిబ్బంది

● 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో బట్టబయలు

ఆంధ్రజ్యోతి విజిట్


మూసివేసిన ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) విభాగంలో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా పని వేళలు పాటిస్తున్నారు. ఉదయం ఓ గంట, మధ్యాహ్నం మరో గంట మాత్రమే కార్యాలయాల్లో కనిపిస్తున్నారు. ఈఈ, ఎస్‌ఈలు ఫీల్డ్‌కు వెళ్లారన్న సమాచారం ఉంటే ఆ గంట కూడా కార్యాలయానికి రారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్‌హెచ్ విభాగంలోని ఈఈ, ఎస్‌ఈ కార్యాలయాలను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం విజిట్ చేసింది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సిబ్బంది ఎవరూ కూడా ఆయా కార్యాలయాల పరిసరాల్లో కూడా కనిపించలేదు. సాధారణ రోజుల్లో కూడా మధ్యాహ్నం 12 నుంచి 1 గంటలలోపు, సాయంత్రం 4 నుంచి 5గంటల లోపు మాత్రమే కొందరు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, అప్పుడు మాత్రమే కార్యాలయానికి రావాలని అక్కడి సిబ్బంది కొందరు పేర్కొన్నారు. ఎన్‌హెచ్ ఎస్‌ఈగా ఉన్న హరిప్రసాద్‌కు ప్రమోషన్ రావడంతో ఆయన గత నెల 23న రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఈఈ సుధాకర్‌రెడ్డికి అప్పగించారు. ఈయన ఎక్కువ శాతం క్షేత్రస్థాయి పర్యటనల్లో ఉంటారన్న ప్రచారం ఉంది. దీంతో సిబ్బంది ఇష్టారీతిన కార్యాలయాలకు వస్తున్నట్లు సమాచారం. ఈఈ కార్యాలయం సమీపంలోని డీఈ డివిజన్ కార్యాలయం పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అక్కడ అటెండర్ తప్ప మరెవరు కనిపించలేదు.

ఎస్‌ఈ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు..

ఎస్‌ఈతో పాటు, డిప్యూటీ ఎస్‌ఈ, సూపరింటెండెంట్, డివిజన్ కార్యాలయంలో ఏఈ-2, సీనియర్ అసిస్టెంట్లు-2, జూనియర్ అసిస్టెంట్లు-2, టీఓ-1, ఏటీఓ-2 పోస్టులు ఉన్నాయి. ఇంత మంది ఉన్న ఏ ఒక్కరు లేక కార్యాలయం ఖాళీగా కనిపించింది.

ఈఈ కార్యాలయంలో కనిపించని సిబ్బంది..

ఈఈ సుధాకర్‌రెడ్డితో పాటు పీఏటూ ఈఈ రామచంద్రారెడ్డి, సూపరింటెండెంట్-1, డీఏఓ-1, టీఓ-1, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అసిస్టెంట్లు-3 అటెండర్లు-4 ఉన్నారు. వీరిలో ఒక వృద్ధురాలైన అటెండర్ తప్ప ఏ ఒక్క సిబ్బంది కనిపించలేదు. దీనిపై ఈఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


ఖాళీగా ఉన్న ఎస్‌ఈ డివిజన్ సిబ్బంది కార్యాలయం


ఖాళీగా ఉన్న ఎస్‌ఈ సర్కిల్ సిబ్బంది కార్యాలయం

ఇక బడిబాట..!

● ముగిసిన కొత్త టీచర్ల నియామక ప్రక్రియ

● నేడు ఉత్తర్వులు..

సోమవారం నుంచి విధులకు..


బీకేఎస్ శిక్షణ కేంద్రంలో చివరిరోజు కొత్త టీచర్లు

అనంతపురం విద్య, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త టీచర్లు సోమవారం నుంచి బడికి వెళ్లనున్నారు. ఎంపిక ప్రక్రియ, శిక్షణ పూర్తయ్యేందుకు సుమారు నెలన్నర సమయం పట్టింది. స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్, ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలను కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 748 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. ఎస్జీటీలో తెలుగు 146 మంది, ఉర్దూ 14 మంది, కన్నడ ఐదుగురు, స్కూల్ అసిస్టెంట్లలో తెలుగు 101 మంది, హిందీ 26 మంది, ఇంగ్లిష్ 25 మంది, ఉర్దూ ఐదుగురు, బయాలజికల్ సైన్స్ 70 మంది, ఫిజికల్ సైన్స్ 64 మంది, గణితం 41 మంది, పీడీలు 142 మంది, సోషల్ స్టడీస్ 108మంది, సోషల్ స్టడీస్ ఉర్దూ ఒక్కరు ఉన్నారు. వీరికి కేటాయించిన పాఠశాలల ఆర్డర్లు శనివారం వస్తాయని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. కొత్త టీచర్లు 13వ తేదీ సోమవారం విధుల్లో చేరాల్సి ఉంటుందని అన్నారు.

ముగిసిన శిక్షణ

కొత్త టీచర్లకు శిక్షణ శుక్రవారం ముగిసింది. అనంతపురం, కర్నూలు జిల్లాకు చెందిన టీచర్లకు బుక్కరాయసముద్రంలోని విజయభారతి డీఎడ్ కాలేజీ, కొర్రపాడు వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణా కేంద్రం, పంగల్ రోడ్డులోని వివేకానంద జూనియర్ కాలేజీలో శిక్షణ ఇచ్చారు. సమస్యలు తలెత్తకుండా విద్యాశాఖ జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ పర్యవేక్షించారు. కొత్త టీచర్లకు పలు సూచనలు చేసారు. శిక్షణా కేంద్రాలలో చివరి రోజు అధికారులు, శిక్షకులు, కొత్త టీచర్లు గ్రూప్ ఫొటోలను తీసుకుంటూ సందడి చేశారు.

మీరంటే చాలా ఇష్టం..

శిక్షణ ముగియడంతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు వర్చ్యువల్‌గా సందేశం ఇచ్చారు. డీఎస్సీ-2025 టీచర్లంటే తనకెంతో ఇష్టమని అన్నారు. నియామక ప్రక్రియలో ఎలాంటి లోపాలు, రాజకీయాలకు తావులేకుండా చూసుకున్నామని అన్నారు. పాఠశాలలకు వెళ్లి చాలా బాధ్యతగా పనిచేసి, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి తెలియజేయవచ్చని, పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


ఐద్వా పోరాటాలు అమోఘం

● ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ


మాట్లాడుతున్న ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ


అనంతపురం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల రక్షణకు ఐద్వా చేస్తున్న పోరాటాలు అమోఘమని ఎస్ఎస్‌బీఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మలమ్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకళామందిర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతికోత్స వాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. కార్యక్రమానికి నిర్మలమ్మ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ ఇండియా లఘుచిత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్మలమ్మ మాట్లాడుతూ మహిళా సమస్యలపై ఐద్వా అనేక ఉద్యమాలు చేపట్టి, హక్కుల రక్షణ కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి, చట్టాలు రూపొందించేలా చేసిందన్నారు. సావిత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ మహిళలపై దాడులు జరిగినా ముందుండి న్యాయంకోసం పోరాడుతున్నది ఐద్వానేనని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షకార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, శైలజ, గీతా, రామాంజినమ్మ, షేక్ రియాజుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు



అనంతపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలుతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 72 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.19



అనంతపురం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.19తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 1650 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. కిలో కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు.

చిరు చిరు జల్లులు

నడిరేయి మబ్బులతో
అనంత ఆకాశ వీధులు
మరింత నల్లబడి.. చల్లబడ్డాయి..!

వేకువనే
చినుకులు మొదలై..
పొద్దెక్కేదాకా రాలుతూనే ఉన్నై..!

వానా.. నువ్వొచ్చావని
బడిని మూసేస్తారా ఏమిటి..?
అన్నింటినీ ఆపేస్తారా ఏమిటి..?

వెళ్లాల్సిందే..!
అమ్మ చెంగుచాటునో..
నాన్నతో గొడుగు చాటునో..

అయినా బాగుంది..
చిటపట చినుకులు
ముఖాన కొడుతూ ఉంటే..!

(అనంతపురం నగరంలో
శుక్రవారం ఉదయం)
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి







పట్టు తప్పితే ప్రమాదం కదా..?



తప్పదు.. వెళ్లాల్సిందే బడికి..



తల తడిస్తే జలుబు చేస్తుంది కన్నా..



బంగారు తల్లి.. భద్రంగా చూసుకుంటోంది..



గొడుగుతో డ్రైవింగ్.. ప్రమాదం సారూ..

పోస్టుమార్టంలో నిర్లక్ష్యంపై నిరసన



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఉరవకొండ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): యువకుడికి పోస్టుమార్టం విషయంలో వైద్యుల నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ కుటుంబ సభ్యులు.. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని లత్తవరం గ్రామ శివారు హంద్రీనీవా కాలువ వద్ద యువకుడు మహేష్ అనుమానాస్పద స్థితిలో గురువారం రాత్రి మృతిచెందాడు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేష్ మృతిపై అనుమానం ఉందనీ, పోస్టుమార్టం పక్కాగా నిర్వహించాలని అతడి కుటుంబ సభ్యులు.. వైద్యులను కోరారు. పోస్టుమార్టం పక్కాగా చేయాలంటే అనంతపురంలో సాధ్యమవుతుందని డాక్టర్ చెప్పడంతో బాధితులు ఆగ్రహానికి లోనయ్యారు. వైద్యుడి నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆస్పత్రి ఎదుట వారు ఆందోళన చేశారు. అనంతపురం-గుంతకల్లు రహదారి కావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. పోస్టుమార్టం చేసేందుకు వైద్యులు అంగీకరించారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

భార్య పుట్టింటికెళ్లిందని భర్త ఆత్మహత్య



కృష్ణమూర్తి (ఫైల్)

ఉరవకొండ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికెళ్లిందన్న మనస్తాపంతో పట్టణంలోని లాల్ స్వామి గుడి సమీపాన నివాసం ఉంటున్న కృష్ణమూర్తి(31) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణమూర్తికి పదేళ్ల క్రితం అనంతపురానికి చెందిన నీలిమతో వివాహమైంది. పదిరోజుల క్రితం ఆమె ఇంట్లో చెప్పకుండా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కృష్ణమూర్తి ఇంట్లో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తలుపులు తెరవకపోవడంతో కిటికీలోంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే తలుపులు బద్దలుకొట్టి, మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైతు ఖాతా నుంచి రూ.లక్ష స్వాహా

సైబర్ మోసంపై బాధితుడి ఫిర్యాదు



బాధిత రైతు రామానాయుడు

బొమ్మనహాళ్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ రైతు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.లక్ష దోచుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని కోళగానహళ్లి గ్రామానికి చెందిన రైతు కావలి రామానాయుడు బ్యాంకు ఖాతా నుంచి ఈనెల 9వ తేదీన సాయంత్రం రూ.19,999 చొప్పున ఐదుసార్లు మొత్తం లక్ష రూపాయలను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామానాయుడు ఫోన్ నంబరుకు రెండ్రోజుల క్రితం ఓ మెసేజ్ వచ్చింది. దానిపై క్లిక్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ఐదుసార్లు డబ్బు బదిలీ అయినట్లు రైతు ఫోన్‌కు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో శుక్రవారం ఉదయాన్నే రైతు.. బ్యాంకుకెళ్లి ఆరాతీశాడు. సైబర్ మోసం అని తెలియడంతో పోలీసులను ఆశ్రయించాడు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్య



శిల్ప మృతికి సంతాపం తెలుపుతున్న సీడీపీఓ, అంగన్‌వాడీలు

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లాపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త శిల్ప(32) శుక్రవారం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన శిల్పకు చల్లాపల్లి వాసి నరేష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. శిల్ప ఇటీవల పుట్టినిట్లు బెంగళూరు వెళ్లింది. నాలుగు రోజుల క్రితం చల్లాపల్లికి వచ్చింది. అప్పట్నుంచి ముభావంగా ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఉదయం స్నానానికి వెళ్లి, ఉరేసుకుంది. ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబికులకు అనుమానం వచ్చి చూశారు. ఉరికి వేలాడుతూ కనిపించింది. తలుపు బద్దలుకొట్టి చూడగా.. అప్పటికే మరణించింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టంకి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. శిల్ప మృతికి సీడీపీఓ శాంతలక్ష్మి, సూపర్‌వైజర్ శోభ, అంగన్‌వాడీ కార్మికుల సంఘం జిల్లా నేత శ్రీదేవి నివాళులు అర్పించారు.

వృద్ధురాలి నేత్రాలు దానం



గూడూరు సరోజమ్మ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధికి చెందిన గూడూరు సరోజమ్మ(80) శుక్రవారం ఉదయం మృతిచెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదానంపై విశ్వదీప సేవాసంఘం సభ్యులు అవగాహన కల్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీ డీవై కుళ్లాయప్ప కంటి రెట్రావల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర కళ్లను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతురాలి కుటుంబ సభ్యులను అభినందించారు.

ఉమ్మడి జిల్లాకు పీఎండీడీకేవై

వ్యవసాయానికి ఊరట... రైతాంగానికి భరోసా

సీఎం చంద్రబాబు దార్శనికత...
మంత్రి కేశవ్ చొరవతోనే..

అనంతపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శనికత, ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ కృషితో ఉమ్మడి జిల్లాలో పీఎండీడీకేవై అమలు కానుంది. దేశవ్యాప్తంగా వంద జిల్లాలో ఈ నూతన పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తొలుత అనంత ఉమ్మడి జిల్లాకు ఈ వంద జిల్లాల జాబితాలో చోటు దక్కలేదు. పీఎండీడీకేవై (ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన) పరిధిలోకి ఉమ్మడి జిల్లాను చేరిస్తే జిల్లా రైతాంగానికి ఒక భరోసా లభిస్తుందని మంత్రి పయ్యావుల కేశవ్ ఆలోచన చేశారు. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసిన్ అకాడమీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చిన సమయంలో పీఎండీడీకేవైని అనంత ఉమ్మడి జిల్లాలో అమలు చేయాలని విన్నవించారు. కేంద్ర పథకం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించారు. సీఎం ఢిల్లీ వెళ్లిన పలు సందర్భాల్లోనూ ఆయన వెంటే వెళ్లిన మంత్రి కేశవ్ కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసి జిల్లా రైతాంగం పడుతున్న బాధలను వివరించారు. ఉమ్మడి జిల్లాను ప్రధానమంత్రి ధన ధాన్య కృషియోజనలో చేర్చాలని విన్నవించారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పీఎండీడీకేవైను ఉమ్మడి అనంత జిల్లాకు వర్తింపజేసింది.

రైతాంగానికి ఊరట

పీఎండీడీకేవై ద్వారా ఉమ్మడి అనంత జిల్లా రైతాంగానికి ఎంతో మేలు కలగనుంది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడం, రైతాంగం జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఈ పథకానికి పశుసంపద, పాడిపరిశ్రమ, మత్స్యసంపద తదితర అనుబంధ రంగాలను అనుసంధానించి స్థానిక జీవనోపాధికి ఇతోధికంగా కృషి చేస్తారు. పంటకోత తరువాత నిల్వ, మెరుగైన నీటిపారుదల, సులభతర రుణ సదుపాయం, సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, గ్రామీణ ఆర్థిక స్థితిని పెంచడం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన ముఖ్య ఉద్దేశ్యం. వరుస కరువులతో నష్టపోతున్న ఉమ్మడి జిల్లా రైతాంగానికి ఈ పథకం ఎంతో ఊరట ఇవ్వనుంది.

నేడు ప్రారంభం

అనంతపురం అర్బన్: ప్రధాన మంత్రి ధన ధాన్య కృషి యోజనను ప్రధాని నరేంద్రమోదీ వర్చ్యువల్‌గా ఢిల్లీ నుంచి శనివారం ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. దేశంలోని 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలో 4 జిల్లాలు ఎంపికవగా అందులో ఉమ్మడి అనంత జిల్లా కూడా ఉందన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగే పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కలెక్టర్, జిల్లా అధికారులు, రైతులు పాల్గొంటారన్నారు.

బీటీపీని పరిశీలించిన కలెక్టర్



బీటీ ప్రాజెక్టు స్థితిగతులను తెలుసుకుంటున్న కలెక్టర్

గుమ్మఘట్ట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీటీపీ (భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు)ని కలెక్టర్ ఆనంద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీటీ ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల మోటార్లు, మరమ్మతులు, ప్రాజెక్టు స్థితిగతులపై మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పైభాగంలో క్రస్ట్‌గేట్లను ఎత్తే మోటార్లను పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ రజాక్‌వలి, ఆర్ఐ రామాంజినేయులు, పలువురు రైతులు ఉన్నారు.

ఎంజేపీ స్కూల్ తనిఖీ

మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుశాతాన్ని, రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. బాలికలకు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవిని ఆదేశించారు.

క్విజ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించే వికసిత్ భారత్-2047 క్విజ్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో మై భారత్ పోర్టల్‌లో ఆసక్తి ఉన్న యువత తమ పేర్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులన్నారు. 12 భాషల్లో మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో క్విజ్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు వచ్చే ఏడాది న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజన దినోత్సవాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. వివరాలకు సెల్ నంబరు 9849913062ను సంప్రదించాలని కోరారు. క్విజ్ పోటీల దరఖాస్తుకు వెబ్‌సైట్: http://mybharat.gov.in/pages/vbyld2026

నంది విగ్రహం అపహరణ

పెద్దవడుగూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లిలో గల ఆంజనేయస్వామి గుడి బయట ఉన్న రాతి నంది విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి దుండగులు అపహరించారు. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలయంలోకి చొరబడిన దుండగులు నంది విగ్రహాన్ని పెకలించుకు వెళ్లారు. శుక్రవారం ఉదయం గుర్తించిన ఆలయ పూజారి ఆదిశేషయ్య.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చోరీపై గ్రామంలో పోలీసులు విచారించారు.



నంది విగ్రహం (ఫైల్)

నాయనా.. జాగ్రత్త..!

మృత్యువులోనూ బిడ్డ కోసం
అమ్మ ఆక్రందన
కూలి ప్రయాణంలో కుదుపు..
బతుకు బండి వాలింది..
ప్రమాదం వచ్చి పడింది..
నాయనా.. జాగ్రత్త.. అంటూ..
అమ్మ కేక వేసింది..
బిడ్డకేమవుతుందోనని
తల్లి గుండె తల్లడిల్లింది..
తన ప్రాణం గురించే..
మరచిపోయింది..
ప్రమాదంలో అమ్మ చనిపోయింది..
అమ్మ ప్రేమను బతికించింది..



మల్లిశెట్టి నాగలక్ష్మి (ఫైల్)



ప్రమాదస్థలంలో నాగలక్ష్మి మృతదేహం

శింగనమల, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): మృత్యువు చుట్టుముట్టిన సమయంలోనూ తల్లి తన ప్రాణం గురించి ఆలోచించకుండా కన్నబిడ్డ కోసం తల్లడిల్లిపోయింది. ప్రమాద సమయంలో 'నాయనా.. జాగ్రత్త..' అంటూ బిడ్డకు ఏమీ కాకూడదని భయం నిండిన గొంతుతో కేక వేసిన అమ్మే చనిపోయింది. గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం వేరుశనగ నూర్పిడి యంత్రం బోల్తా పడిన ప్రమాదంలో మహిళా కూలీ మల్లిశెట్టి నాగలక్ష్మి(35) దుర్మరణం చెందింది. యంత్రం అదుపు తప్పి పడిపోతుండగా.. ఆమె అదే వాహనంపై ఉన్న కుమారుడు వసంత్‌కుమార్‌కు ఏమవుతుందోనని ఆందోళన చెందింది. కుమారుడికి జాగ్రత్త చెప్పింది. రెండు నిమిషాల్లోనే ఆమె చనిపోయింది. వసంత్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. 'అమ్మా.. లేమ్మా.. ఇప్పుడే కదా.. జాగ్రత్త అన్నావు. రెండు నిమిషాల్లో మమ్మల్ని వదిలిపెట్టి పోతివా..' అంటూ నాగలక్ష్మి మృతదేహంపై పడి కుమారుడు వసంత్‌కుమార్ బోరున విలపించాడు. ప్రమాదంలో మరో కూలీ రంగస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. మరికొందరు కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కూలి కోసం వెళ్తూ..

పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన 11 మంది కూలీలు శుక్రవారం మధ్యాహ్నం చింతమేకలపల్లికి చెందిన రైతు వేరుశనగ పంట నూర్పిడి పనులకు బయల్దేరారు. నూర్పిడి యంత్రంపై కూర్చుని వెళ్తున్నారు. గార్లదిన్నె మండలం గుడ్డాలపల్లి రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లగానే.. యంత్రం అదుపు తప్పి రోడ్డుపై బోల్తాపడింది. దానిపై కూర్చుని ప్రయాణిస్తున్న కూలీలు కింద పడ్డారు. మల్లిశెట్టి నాగలక్ష్మి, రంగస్వామి మీద యంత్రం పడింది. నాగలక్ష్మి తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందింది. రంగస్వామికి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉంది. అనంతపురం ఆస్పత్రికి తరలించారు. నాగలక్ష్మికి భర్త ఈశ్వరయ్య, కుమారుడు వసంత్‌కుమార్, కుమార్తె అవంతిక ఉన్నారు. ప్రమాదంపై గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలల క్రితమే స్వగ్రామానికి..

నాగలక్ష్మి, ఈశ్వరయ్య దంపతులు తిరుపతికి గతంలో వలస వెళ్లారు. అక్కడ హోటల్‌లో పనిచేస్తుండేవారు. వర్షాలు కురుస్తుండడంతో హోటల్ పనులులేక రెండు నెలల క్రితం స్వగ్రామం తరిమెలకు వచ్చారు. వ్యవసాయ కూలి పనులకు వెళ్తుండేవారు. ఈ క్రమంలోనే శుక్రవారం నాగలక్ష్మి, కుమారుడు వసంత్‌కుమార్ వేరుశనగ నూర్పిడి పనులకు వెళ్లారు. యంత్రం బోల్తాపడి నాగలక్ష్మి మృతి చెందగా.. కుమారుడు సల్పగాయాలతో బయటపడ్డాడు.

మహాసభలను జయప్రదం చేయండి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం కేంద్రంగా ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి సావిత్రి పిలుపునిచ్చారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె సంఘం ఏర్పాటు, మార్పులు, పోరాటాలు తదితరాల గురించి వివరించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల, చంద్రిక, నగర కార్యదర్శి అశ్విని, జిల్లా నాయకురాళ్లు రామాంజినమ్మ, అక్కమ్మ, వెంకటరమణమ్మ, సునంద, కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బిల్లును ఉపసంహరించాలి

- ఏఐఆర్ఆర్ఎఫ్



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

గుంతకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఆమోదించిన ఆర్థిక బిల్లును ఉపసంహరించుకోవాలని ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) అధ్యక్ష కార్యదర్శులు జి.జయంత్‌కుమార్, వి. సుంకప్ప డిమాండ్ చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఏఐఆర్ఆర్ఎఫ్, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యాలయం నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ చేసి, ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జయంత్ కుమార్, సుంకప్ప మాట్లాడుతూ పెన్షనర్లకు కరోనా కాలంలో పెండింగులో ఉంచిన 18 నెలల డీఏను వెంటనే చెల్లించాలని, కమ్యుటేషన్ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు కుదించాలని, రిటైర్మెంటు తేదీ ఆధారంగా పెన్షనర్లను విభజించరాదని డిమాండ్ చేశారు. 8వ పే రివిజన్ కమిషన్ ప్రయోజనాలను కార్మికులు, రిటైర్డు ఉద్యోగులకు సమానంగా వర్తింపజేయాలని కోరుతూ ఏడీఆర్ఎం సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ఎఫ్ ఏడీఎస్ సీబీ సత్య విజయరాజు, కోశాధికారి జీ వీరన్న, వెంకటరమణ, ఖాజా హుస్సేన్, కృష్ణమూర్తి, కుమార్ వేలు, పద్మనాభం పాల్గొన్నారు.

లా పరీక్ష ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన లా కోర్సు రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు శుక్రవారం విడుదల చేశారు. యూజీ ఆరు, పది సెమిస్టర్ల రెగ్యులర్, సప్లిమెంటరీ, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, పదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లా విభాగాధిపతి శ్రీరాములు, పరీక్షల విభాగ డైరెక్టర్ జీవీ రమణ, ప్రొఫెసర్ శోభలత, పరీక్షల కంట్రోలర్ శ్రీరామ్‌నాయక్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కదిరి అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ చెన్నకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిప్పలమడుగు, సైదాపురం, చలమకుంట్ల పల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమానితులు కనిపిస్తే తెలపండి : సీఐ

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనుమానితులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పట్టణంలోని ఇందిరమ్మ, కేతిరెడ్డి కాలనీల ప్రజలకు టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. పట్టణంలోని ఆ రెండు కాలనీల్లో సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ఉదయం అనుమానితులు, కొత్తవ్యక్తుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు తిరుగుతుంటే వెంటనే 100 డయల్‌కు తెలియ జేయాలని ఆయా కాలనీ వాసులకు సీఐ తెలిపారు. అదేవిధంగా ఇళ్లు బాడుగకు ఇచ్చేటప్పుడు ఏదైనా గుర్తింపు కార్డును చెక్‌చేయాలన్నారు. నెంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్రవాహనాలను కాలనీలో ఎవరైనా నడుపుతుంటే వారి గురించి పోలీసులకు తెలపాలని సూచించారు. ఎటువంటి గొడవలకు దిగరాదని హెచ్చరించారు.

ప్రశాంతంగా జీవించండి

ధర్మవరం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని సుబ్బరావుపేటలో పర్యటించారు. ప్రజలతో గ్రామసభ నిర్వహించి, ప్రజలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తూ మృతిచెందిన ముగ్గురి కుటుంబాలకు సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సహచర ఉద్యోగులు చేయూత నందించారు. సమగ్రశిక్షలో ఎన్పీకుంట ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ బషీర్, నల్లమాడ ఎంఈఓ కార్యాలయం లో పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ మోహన్‌రెడ్డి, కొత్తచెరువు మండలం బండ్లపల్లి క్లస్టర్ జడ్పీహెచ్ఎస్‌లో సీఆర్ఎంటీగా పనిచేస్తున్న బాబావలి వివిధ కారణాలతో మృతిచెందారు. దీంతో స్పందించిన జిల్లా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో తోటి ఉద్యోగుల నుంచి విరాళాలుగా రూ. 51వేల మొత్తాన్ని సేకరించారు. అందులో మృతుల కుటుంబ సభ్యులు మాధవి, సహీర, అమీనమ్మకు ఒక్కొక్కరికి రూ.17వేలు చొప్పున ధర్మవరం ఎమ్మార్సీ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామన్న, ఉపాధ్యక్షుడు ఓబుళేశు, కోశాధికారి శేఖర్, మల్లికార్జున, ఈశ్వరమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

● బంజారా సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సంఘం నాయకులు

ముదిగుబ్బ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుట్టపర్తి సమీపంలోని జగరాజు పల్లిలో నిర్వహించే అఖిల భారత బంజారా సేవా సంఘం కార్యవర్గ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు పేర్కొన్నారు. వారు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. బంజారాల హక్కుల కోసం 24 అంశాలతో ఈ నెల 12న ఆదివారం పుట్టపర్తి సమీపంలోని జాగరాజు పల్లిలో నిర్వహించే సమావేశానికి ముదిగుబ్బ మండలంలోని ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బంజారా నాయకులు సేవే నాయక్, తిరుపాల్ నాయక్, ఆంజనేయులు నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌కు కదిరి నాయకుల సన్మానం

తనకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌గా ఎంపికైన కొట్టె సాయిని జనసేన పార్టీ కదిరి నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం శ్రీకాళహస్తికి వెళ్లి ఆయనను కలిసినట్లు వారు తెలిపారు. యువ న్యాయవాది కొట్టె అశ్వత్ కుమార్, జనసేన కదిరి రూరల్ మండలం కన్వీనర్ మహేష్‌బాబు, సంకు వెంకటరమణ, మల్లెపూల రవి, అనీల్, శంకర్, తుమ్మలప్ప, లక్ష్మన్న, అశోక్ కిరణ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గతనెల 12వ తేదీన సరస్వతి అనే మహిళ హత్య కేసులో నిందితులైన మరో ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఇందిరమ్మకాలనీకి చెందిన సరస్వతి అనే మహిళ గతనెల 12వతేదీ హత్యకు గురైంది. సంబంధిత వివరాలు ఆలస్యంగా తెలియడంతో ఈ హత్య కేసులో భర్తతో పాటు మరో ఆరుగురిపై గతనెల 14వతేదీన కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ హత్యకేసులో ఇదివరకే ఆమె భర్తతో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇంకొక నిందితుడు పరారీలో ఉన్నాడని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గాండ్లపెంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను శుక్రవారం పట్టు కున్నట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు. నంబులపూలకుంట మండలం నుంచి కదిరికి ఆటోలో రేషన్ బియ్యం తీసుకొని వెళ్తున్నారనే సమాచారం మేరకు ఆర్ఐ జాఫర్ వలి, వీఆర్ఓ చంద్ర శేఖర్ వెళ్లారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై వేప రాల సమీపంలో ఆటోను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వద్దకు తీసుకొచ్చారు. అందులో ఏడు బస్తాల (సుమారు 350 కిలోలు) రేషన్ బియ్యం ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. ఆ ఆటోను పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసిన తరువాత బియ్యాన్ని స్థానిక స్టాక్ పాయింట్‌కు తరలిస్తామని ఆయన తెలిపారు.

శ్మశాన స్థలానికి పట్టా ఇవ్వండి

● తహసీల్దార్‌కు ఎస్సీల వినతి

కదిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో ఉన్న కుటాగుళ్ళ గ్రామంలో దాదాపు 300 వరకు ఎస్సీలు నివసిస్తున్నారు. 30 సంవత్సరాలుగా గుర్రాలంక వద్ద ఉన్న శ్మశానవాటికలో మృతదేహాలను ఖననం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఆ స్థలానికి పట్టా ఇవ్వాలని కాలనీవాసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తరతరాలుగా వస్తున్న శ్మశాన వాటిక స్థలానికి పట్టా ఇవ్వాలని వారు కోరారు. కొంతమంది తమకు పట్టా ఉందంటూ శ్మశాన స్థలంలో కంచెలు వేస్తున్నారని, వారి నుంచి కాపాడాలని తహసీల్దార్‌ను వారు కోరారు.

పంచాయతీ పన్నుల ఎగవేత

● స్థానికులకు ఉపాధి కల్పన శూన్యం
● స్టోన్ క్రషర్ల యజమానుల తీరుపై విమర్శలు



వేపరాల పంచాయతీలోని స్టోన్ క్రషర్ పరిశ్రమ

గాండ్లపెంట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏదైనా పరిశ్రమ నెలకొల్పితే అందులో స్థానికులకు, సంబంధిత పంచాయతీలకు లబ్ధి, ఆదాయం చేకూరుతుంది. అయితే మండలంలోని వేపరాళ్ల పంచాయతీలో పరిస్థితి మరోరకంగా ఉంది. వేపరాళ్ల పంచాయతీలోని పాలకాలవ గ్రామ సమీపంలో స్టోన్‌క్రషర్ మిషన్ ఏర్పాటు చేశారు. సమీపంలో ఉన్న గుట్టలు, కొండల్లోని తెల్లరాతిని తీసుకొచ్చి ఇక్కడ పొడి చేసే పరిశ్రమ నెలకొల్పారు. దీని ద్వారా స్థానిక పంచాయతీ వాసులకు ఉపాధి కల్పించాలి. అయితే స్థానికులను పక్కన పెట్టి ఇతర రాష్ట్రాల వారికి పనులు కల్పిస్తున్నారని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. అలాగే పంచా యతీకి అరకొరగా పన్నులు కట్టి ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శిస్తున్నారు.

అధికారుల కుమ్మక్కు.. పన్నులకు ఎగనామం

మండలంలో ఎక్కడైనా ఏదైనా పరిశ్రమ నెలకొల్పాలంటే సంబంధిత పంచాయతీ సర్పంచు, కార్యదర్శులు, స్థానిక ప్రజలతో చర్చించి ఏర్పాటు చేయాలి. అదేవిధంగా నిర్ధేశించిన పన్నులను పంచాయతీకి చెల్లించిన తర్వాత, పంచాయతీ అధికారుల అనుమతులు పొంది పరిశ్రమ నెలకొల్పి, నడుపుకోవాలి. వేపరాలలోని పెద్దల పేరుచెప్పి పంచాయతీకి మొ క్కుబడిగా పన్నులు చెల్లించి స్టోన్ క్రషర్ పరిశ్రమను నడుతున్నారని స్థానిక ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వేపరాల పంచాయతీలోని ఓ స్టోన్‌క్రషర్ యాజమానులు గతంలో అధికారులతో కుమ్మక్కై పంచాయతీకి కట్టాల్సిన పన్నులు కట్టలేదని సమాచారం. ప్రస్తుతం అదే గ్రామంలో ఇంకో స్టోన్ క్రషర్ పరిశ్రమ ఏర్పాటుచేశారు. దానికి సంబంధించి కూడా పంచాయతీకి అంతంత మాత్రమే పన్నులు చెల్లించారని పంచాయతీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో పంచాయతీకి ఆదాయం లేకపోవడంతో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, స్థానికులకు ఉపాధి లేదని పలువురు విమర్శిస్తున్నారు.

గుట్టువిప్పని అధికారులు

వేపరాల పంచాయతీలో స్టోన్ క్రషర్ పరిశ్రమను గతంలో ఒకటి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇంకొకటి నెలకొల్పేందుకు పనులు ప్రారంభించారు. ఈ రెండింటి విషయంలో అధికారులు క్రషర్ యజమానులతో కుమ్మక్కై పన్నులకు గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే పన్నుల విషయంపై పంచాయతీ కార్యదర్శిగానీ, ఎంపీడీఓగానీ నోరు మెదపక పోవడం గమనార్హం.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

● కాపు సంఘం నాయకులు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను, పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కాపు సంఘం నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు కాపు సంఘం నాయకుడు చింతా దామోదర్ ఆధ్వర్యంలో శుక్రవారం పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలకు చెందిన కాపుసంఘం నాయకులు డీఆర్ఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందచేశారు. ఈనెల 17వ తేదీన శ్రీకృష్ణదేవారాయల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు కోరారు. అదేవిదంగా పట్టాభిషేక మహోత్సవం, జయంతిని నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల కరుణాకర్, సుబ్బారావ, అల్లాడి జయరాం, సంఘా శ్రీనివాసులు, శెట్టిపల్లి సతీష్, పసుపులేటి రమణ, రఘుపతి మల్లికార్జున, నల్లమాడ మైలే శివశంకర్ మల్లికార్జున పాల్గొన్నారు.

వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం

● పింఛన్ సొమ్ము స్వాహా ● ఆలస్యంగా వెలుగులోకి

నల్లచెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో వలంటీరు, వెల్ఫేర్ అసిస్టెంట్ కలిసి ఓ వితంతు పింఛన్ మొత్తాన్ని దర్జాగా కాజేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెం దిన వితంతువు (పింఛన్ ఐడీ 12500014561) ద్వారా 2022, జూలై 07 నుంచి పింఛన్ పొందుతూ ఉంది. ఆమె బతుకుతెరువు కోసం 2022, డిసెంబరు 2న సౌదీకి వెళ్లింది. అది అదునుగా భావించిన ఆ వలంటీరు... వెల్ఫేర్ అసిస్టెంట్ సహకారంతో ప్రతినెలా ఆమె పింఛన్ మొత్తాన్ని కాజేయడం మొదలుపెట్టారు. ఆమె గతనెల 15 తేదీన స్వగ్రామానికి వచ్చి, తన పింఛన్‌ను పునరుద్ధరించమని అధికారులను కోరారు. పరిశీలించిన అధికారులు పింఛన్‌ను స్వాహా చేసిన విషయాన్ని గుర్తించారు. నాలుగు నెలలుగా గార్లదిన్నె సచివాలయంలో డ్రా అయినట్లు తెలిసింది. దీనిపై అధికారులు విచారణ జరపగా మండల కేంద్రంలోని సచివాలయం-1లో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విజయ్ కాంత్‌రెడ్డి పింఛన్ నిధులను దుర్వినియోగపరిచారని, బదిలీల్లో భాగంగా గార్లదిన్నెకు పంపారు. అతడు ఆ పింఛన్ కూడా బదిలీ చేసుకొని డ్రా చేసుకున్నట్లు గుర్తించారు. రూ.1.24 లక్షలను వ్యక్తిగత పనులకు వాడుకున్నారనీ, వెల్ఫేర్ అసిస్టెంట్‌పై సీపీఏ నిబంధనలు మేరకు చర్యలు చేపట్టమని పీడీకి నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు.

బోధనేతర విధుల బహిష్కరణ: ఫ్యాప్టో



ఓడీసీలో ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం నుంచి మండలంలో అన్ని పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో జిల్లా కార్యదర్శి గౌసులాజం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల విద్యాశాఖాధికారులు సురేష్ బాబు, రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి పాఠశాలల్లో కేవలం ఉపాధ్యాయుల హాజరు, పిల్లల హాజరు, మధ్యాహ్న భోజనం పనులు మాత్రమే చేస్తారని తెలిపారు. మిగిలిన బోధనేతర పనులన్నీ బహిష్కరిస్తున్నామన్నారు. ఫ్యాప్టో నాయకులు సోమశేఖర్ నాయక్, రామ్‌కుమార్, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, వెంకట చలమయ్య, శ్రీనివాసులు, మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన

బుక్కపట్నం, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుచ్చయ్యగారిపల్లి లో నా పట్టు- నా అభిమానం' ప్రచారంలో భాగంగా పట్టు రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కారక్రమానికి అనంతపురానికి చెందిన ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అప్పలనాయుడు, ఏఎస్ఓ వేణుగోపాల్, టీఓలు బాబాయ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

గాండ్లపెంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా వివిధ కేసుల రికార్డులను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎవరు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు. శాంతి భద్రతలపై నిఘా ఉంచేందుకు పలుచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సిబ్బంది కొరత లేకుండా చూస్తామని ఆయన తెలిపారు. తనిఖీలు ఎస్పీతోపాటు డీఎస్పీ శివనారాయణ స్వామి, సీఐ నాగేంద్ర, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాల తనిఖీ

నల్లమాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు, భోజనశాల, మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను, స్నానపు గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, వాటిలో ఉన్న పైప్‌లైన్ మరమ్మతులు చేయించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రెడ్డిపల్లిలో సచివాలయం సమీపాన ఉన్న హౌసింగ్‌లే అవుట్‌ను పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈ ఓ వేమనారాయణ, ఈఓఆర్డీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు సతీష్, వార్డెన్ మధు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం...

● కదిరిఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేకాధికారి రాము నాయక్ అకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను, రికార్డులు పరిశీలించారు. విద్యార్థినులకు వడ్డించే ఆహారాన్ని రుచి చూశారు. వారు నిద్రించే గదులను తనిఖీచేశారు. హాస్టల్లో వసతులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ మురళీ కృష్ణ, ఎంపీడీఓ పోలప్ప పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్లకు ఎస్ఐ నోటీసులు

తనకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లకు తనకల్లు ఎస్ఐ గోపి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. బీఎంఎస్ 168 ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బ్యాంక్ మేనేజర్‌లు బ్యాంక్‌ల వద్ద భద్రతా సిబ్బందిని నియమించు కోవాలని, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో పరిశీలించుకోవాలని తెలిపారు. అనుమాన స్పద వ్యక్తులుగా ఎవరినైనా గుర్తించినా, ఏవైనా సమస్యలు ఉన్నా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. భద్రతా నియమాలు పాటించాలని కోరారు. మండలంలోని స్టేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌లకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో తనకల్లు పోలీసులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య వార్షికోత్సవం

తనకల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజువారిపల్లి సమీపంలో ఉన్న చౌడేశ్వరీ మండల సమాఖ్య సమావేశ మందిరంలో శుక్రవారం ఆ సమాఖ్య వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు అనంతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది చేపట్టిన ఆర్థిక లావాదేవీలను, సిబ్బందివ పనితీరును ఏపీఎం జయంతి వివరించారు. సిబ్బంది పనితీరును తెలియజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలిగా పూసలిపల్లికి చెందిన అనీఫా బి, కార్య దర్శిగా దిగినేపల్లికి చెందిన మంజుల, కోశాధికారిగా ఉమాదేవిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సమాఖ్యల లీడర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, టీడీపీ నాయకులు తోట సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి

● అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో అధికారులు



ఓడీసీలో కిశోరి వికాసంపై వేసిన ముగ్గును పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టాయని, వాటిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఉన్నతంగా రాణించాలని అధికారులు తదితరులు సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి వీరమ్మ, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎంఈఓ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఆర్టీటీ ఏపీఎం లక్ష్మీనారాయణ, చైల్డ్‌లైన్ సంస్థ కో ఆర్డినేటర్ గిరిస్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా కేజీబీవీలోనూ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు..

● ధర్మవరం, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బాలికా దినోత్సవంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, ప్రత్యేకాధికారి నరసింహమూర్తి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, సీడీపీఓ లక్ష్మి తదితరులు హాజరయ్యారు.

● నల్లమాడ: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలికల దినోత్సవానికి జిల్లా విద్యాశాఖ అధికారి జి. కిష్టప్ప, ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

● బుక్కపట్నంలోని కేజీబీవీలో, బత్తలపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, ఓబుళదేవర చెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

జిల్లాకు మీ సేవలు అమోఘం

● మాజీ మంత్రి పల్లె ● జేసీ అభిషేక్ కుమార్‌కు సన్మానం



జేసీని సన్మానిస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ మారి టైమ్ బోర్డు సీఈఓగా బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ జిల్లాకు చేసిన సేవలు అమోఘమని మాజీమంత్రి పల్లె రఘునాధరెడ్డి కొనియాడారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్‌కుమార్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి పట్టుశాలువాతో ఘనంగా సన్మానించారు. . మాజీ మంత్రి వెంట కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● వార్డు సచివాలయ ఉద్యోగుల వినతి



మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఉద్యోగులు

ధర్మవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వార్డు సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయ మేనేజర్ రాజేశ్వరికి విన్నవించారు. వారు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. మూడునెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, బదిలీపై వచ్చిన ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఆరియర్స్ బిల్లులు చెల్లించాలని తెలిపారు. అలాగే పాటు మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులను ఆమోదించాలని విజ్ఞప్తిచేశారు. తమ సమస్యల పరిష్కారాన్ని వాయిదా వేయడం విచారకరమని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టర్‌కు వడిత్యా శంకర్ నాయక్ వినతి

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైసీపీ నాయకుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలోని గిరిజన ప్రజలకు సంబంధించిన పలు ముఖ్యమైన సమస్యల గురించి వివరించారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టిపెట్టాలని, వారి సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం అన్ని స్థాయిలలో కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎల్ఐసీ నారాయణ నాయక్, ఆనంద్ నాయక్, గోపాల్ నాయక్, అంజి నాయక్, సురేంద్ర నాయక్, చిన్నంజి నాయక్, శశిధర్ నాయక్, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం చెరువులో గంగపూజ



గంగపూజ చేస్తున్న హరీశ్‌బాబు

ధర్మవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధర్మవరం చెరువు నిండి మరువ పారుతోంది. దీంతో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ధర్మవరం చెరువులోని మొదటి మరువవద్ద శుక్రవారం గంగపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధర్మవరం చెరువు నిండడం పట్టణాభివృద్ధికి సంకేతమన్నారు. చెరువు పునరుద్ధరణకు మంత్రి సత్యకుమార్‌యాదవ్ నాయకత్వంలో చేపట్టిన ప్రయత్నాలు ఫలించాయన్నారు. కార్యక్ర మంలో ధర్మవరం సాగునీటి సంఘం అధ్యక్షుడు రేనాటి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


శివాజీ విగ్రహ ఏర్పాటుకు వినతి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కూడలిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ప్రజలు, నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, ఆకుతోట రామచంద్ర, ఆకుతోట హరికృష్ణ మాట్లాడుతూ... కులాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు సున్నంపల్లి రంగారెడ్డి, నరేష్ బాబు, జగదీష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ల పరిశీలన

అమడగూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో వేసిన లే అవుట్లలో పేదలకు ఇచ్చిన స్థలాలలో గృహాల నిర్మించుకోకపోతే పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీఓ మునెప్ప, హౌసింగ్ ఏఈ శివకుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ కులశేఖర్ పాల్గొన్నారు.

ఇలా ఉంటే ఎలా వెళ్లేది?



ధర్మవరం రహదారిలో ఇళ్ల ఎదుట నిలిచిన వర్షపు నీరు

కొత్తచెరువు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధర్మవరం రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్ల ఎదుట వర్షపునీరు నిలబడడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడు తున్నారు. ఇటీవల ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డుకు పక్కన ఉన్న మట్టిని ఎక్స్‌వేటర్లతో తొలగించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడ్డాయి. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు ఇళ్ల ఎదుట ఉన్న గుంతల్లోకి చేరింది. దీంతో ఇళ్లలోకి వెళ్లేందుకు, ఇళ్ల నుంచి బయటకు వచ్చేం దుకు ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



సింగిల్ విండో అధ్యక్షుడు శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయితేజ ఫంక్షన్‌హాల్‌లో కిరికెర సింగిల్‌విండో అధ్యక్షుడు శంకర్ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల కన్వీనర్ రాము, పట్టణ కన్వీనర్ వెంకటేశ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, నాయకులు నాగరాజు, అరుణాచలరెడ్డి, మంజునాథ్, లీగల్‌సెల్ అధ్యక్షులు శివశంకర్, అంజి, చెన్నమ్మ, రమేష్, అంజినరెడ్డి పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల్లో ధైర్యం నింపాలి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక వికలాంగుల్లో ప్రతి ఒక్కరూ ధైర్యం నింపాల్సిన అవసరం ఉందని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లునాయక్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారిని ప్రోత్సహించాలన్నారు. మానసిక వికలాంగుల ఆరోగ్య పరిస్థితి చక్కబెట్టేందుకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చిన్నపాటి విషయానికే మానసికంగా ఆందోళనకు గురికావడం మంచిది కాదన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ, మానసిక వైద్య నిపుణులు రాజగోపాల్, జీవన, ఎస్ఐ శ్రీధర్, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, సంతోష్‌కుమారి, నవేరా, పవిత్ర, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం అమ్మితే పీడీ యాక్ట్: ఎక్సైజ్ సీఐ

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం అమ్మినా, తయారుచేసినా వారిపై పీడియాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కల్లు, మద్యం దుకాణాలు, బార్లను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఎస్ఐలు పృథ్వీ, ఫారూక్, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులు ఆపండి: ఎంపీటీసీలు

రొళ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కొత్త పాలకవర్గం ఎన్నికయ్యే వరకు బిల్లుల చెల్లింపులను నిలుపుదల చేయాలని ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత, విజయరంగేగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులు తమకు నాలుగు సంవత్సరాల కాలంలో కనీస గౌరవం లేకుండా చేశారని గ్రామాల్లో తమకు తెలియకుండా ఇతరులకు పనులు కేటాయించి తమకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పై వాగ్వాదానికి దిగారు.

మాది మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

● అంబేడ్కర్ స్మృతి వనం భూమిపూజలో ఎంపీ, ఎమ్మెల్యే



భూమిపూజలో ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తదితరులు

అమరాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం మాదని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వన భవనం, ప్రహరీగోడ, నందమూరి తారకరామారావు విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. చంద్రబాబునాయుడు విజన్ ఉన్న నాయకుడన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి కావాల్సిన నిధులు అత్యధికంగా తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఉన్నతమైన నియోజకవర్గంగా మడకశిరను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, ఎంపీడీఓ రామారావు, కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, జడ్పీటీసీ సౌరక్క, నర్సింహమూర్తి, శివరుద్రప్ప, రామచంద్రప్ప, మారుతిప్రసాద్, దాదాపీర్, కుమారస్వామి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ: ఎమ్మెల్యే

మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి భూతప్ప కనుమ సమీపంలో వాసవీ యువతి సంఘం ఆధ్వర్యంలో పదివేల సీడ్‌బాల్స్‌ను మొక్కలు పెంచేందుకు ఫారెస్టులో వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఇలాంటి ఆలోచనలు రావడం ఎంతో శుభపరిణామం అన్నారు. సీడ్‌బాల్స్‌లో వేపతో పాటు మరికొన్ని విత్తనాలు అందులో పెట్టి ఫారెస్టు ఏరియాలో చల్లారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఫారెస్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి

నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు

మెగా జాబ్‌మేళాలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

హిందూపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): యువత లక్ష్యసాధనతో ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎస్‌డీజీఎస్ కళాశాలలో రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో 17 ప్రముఖ కంపెనీలు వచ్చాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, పట్టణ కన్వీనర్ వెంకటేష్, డైమండ్‌బాబా, పవన్, కళాశాల కరస్పాండెంట్ రాంప్రసాద్, దాసా గంగాధర్ పాల్గొన్నారు.

మొక్కలు సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత: కలెక్టర్

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మొక్కలు సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యత అని కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం గోరంట్ల నుంచి బడే నాయక్ తండా మీదుగా వెళ్లే హైవే 342 రహదారి పక్కన సామాజిక అటవీ విభాగం డీఎఫ్ఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రీన్ సత్యసాయి జిల్లాను రూపొందించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లావ్యాప్తంగా 27,23,585 మొక్కలు నాటడం జరిగిందన్నారు. డీఎఫ్ఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. కలెక్టర్ సూచన మేరకు మొక్కలను అందజేయడం జరుగుతుందన్నారు.

సిబ్బంది పనితీరుపై కమిషనర్ ఆగ్రహం

పెనుకొండ టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది పనితీరుపై కమిషనర్ సతీష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై శుక్రవారం కమిషనర్, సీఎస్‌డీటీ ప్రభావతి పర్యవేక్షించారు. ఈ క్రమంలో 3,4,5 సచివాలయ పరిధిలోని సిబ్బంది విధులకు సక్రమంగా రాలేదన్న వాస్తవాలు బయటపడ్డాయి. వీరిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పాడిరైతుల అభివృద్ధికి కృషి చేస్తాం

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

గుడిబండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గుడిబండలో మూతబడ్డ పాల డెయిరీని త్వరలో ప్రారంభించి పాడి రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎనిమిదవ వార్షికోత్సవ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన సరుకులను రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వాటిని కొనుగోలు చేసి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషిచేస్తుందన్నారు. మహిళా సంఘం సభ్యులు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ కేశవరెడ్డి, ఏసీ నాగరాజు, ఏటీఎం తిప్పన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం తగదు

సర్పంచుల సంఘం అధ్యక్షుడు అంజీనాయక్

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధిలో రాజకీయ జోక్యం తగదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు అంజీనాయక్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ప్రణాళిక సంఘం నిధులు సర్పంచ్ ఖాతాకు జమ అయినా రాజకీయ అడ్డంకులతో వాడుకోలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చేసిన పనులకు బిల్లులు అందకపోతే కొత్త పనులు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. మంత్రి సవిత చొరవ చూపాలని కోరారు. ఎస్ఐ రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీఓ నర్సింగరావు, ఎంపీపీ గంగమ్మ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. రెగ్యులర్ ఎంపీడీఓ వెంకటలక్ష్మీ సోమవారం విధులకు హాజరవుతారని సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సర్పంచులు రోడ్డెక్కడం సరికాదు: టీడీపీ

సోమందేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్పంచులు నిధులకోసం రోడ్డెక్కడం సరికాదని టీడీపీ మండల నాయకులు విమర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు 14వఫైనాన్స్ నిధులు మంజూరైనా వైసీపీ ప్రభుత్వం తన అవసరాలకు వాడుకుందన్నారు. అప్పుడు ప్రశ్నించని సర్పంచులు ప్రస్తుతం ఇలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. 15వ ఫైనాన్స్ నిధులు విడుదలై సర్పంచ్, కార్యదర్శి జాయింట్ ఖాతాలకు జమ అయ్యాయన్నారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మీ శిక్షణలో భాగంగా సెలవుపై వెళ్లడం, ఈఓఆర్డీ రిటైర్డ్ అవ్వడంతో కొంత ఇబ్బందులున్న విషయం వాస్తవమేనన్నారు. అయితే ప్రభుత్వంపై వైసీపీ సర్పంచులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగేపల్లి వెంకటరమణ, ఆంజనేయులు, డీవీ ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, సూరీ, సూర్యనారాయణ, సర్పంచ్ నరసింహులు, మద్దిలేటి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ సుబ్రహ్మణ్యం

మడకశిరటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మడకశిర అర్బన్ సీఐగా సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మడకశిరలో సీఐగా విధులు నిర్వహిస్తున్న నాగేష్‌బాబుపై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఆయనను వీఆర్‌కు పంపారు. దీంతో సుబ్రహ్మణ్యంను మడకశిర అర్బన్ సీఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని, ఎవ్వరినీ ఉపేక్షించబోమని అన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థినులు

అగళి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. బేటీ బచావ్... బేటీ పడావ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, జడ్పీటీసీ ఉమేష్, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం మస్తాన్, ఆర్డీటి రీజనల్ డైరెక్టర్ ఓబులేష్, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప, మార్కెట్‌యార్డ్, డైరెక్టర్ శివరాములు తదితరులు పాల్గొన్నారు.